దయనీయ స్థితిలో ప్రభుత్వ పాఠశాల

- రేకుల షెడ్‌లో మగ్గిపోతున్న విద్యార్థులు
- మరుగు దొడ్లు, ఆటస్థలం లేక అవస్థలు
- పట్టించుకొని పాలకులు



ప్రమాదకరమైన రేకుల షెడ్‌లో నడుస్తున్న మంగళపాలెం పాఠశాల

కొత్తవలస: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెలిగిపోతోందని.. విద్యావ్యవస్థకు పెద్దపీట వేశామని ఎక్కడపడితే అక్కడ తెగ ఊకదంపుడు ఉపన్యాసాలను కూటమి ప్రభుత్వ పెద్దలు ఇస్తున్నారు. వాస్తవంగా చూస్తే కడుపు తరుక్కుపోయే పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అంతంతమాత్రంగానే ఉన్నారు. అలాంటిది ఆ పాఠశాలలో 26 మంది విద్యార్థులు ప్రస్తుతం విద్యాభ్యాసం చేస్తున్నారు. వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారిపోయింది. కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామ ప్రాథమిక పాఠశాల పరిస్థితి చూస్తే ఎవరికైనా అయ్యో అనిపిస్తుంది. గ్రామంలో సుమారు 3500 మంది జనాభా ఉన్నారు. గ్రామంలో ఆర్‌సీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ఎయిడెడ్ పాఠశాల ఉండేది. ఈ పాఠశాలను 2024–25 విద్యాసంవత్సరంలో ఆర్‌సీఎం యాజమాన్యం పూర్తిగా ప్రభుత్వానికి అప్పగించి తప్పుకుంది. దీంతో ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకుని నడుపుతోంది. గత సంవత్సరం వర్క్ సర్దుబాటులో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి నియమించారు. ప్రస్తుత ఏడాది పూర్తిస్థాయిలో మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. కాగా ఈ పాఠశాలలో ప్రస్తుతం 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 26 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇంకా ప్రవేశాల కోసం విద్యార్థులు వస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ పాఠశాలను ప్రస్తుతం రూ.15వందల అద్దెతో అతి పురాతన భవనంలో నిర్వహిస్తున్నారు. ఒకే ఒక ఇరుకు గది ఉంది. ఆరుబయట అత్యంత ప్రమాదకరమైన రేకుల షెడ్‌లో పాఠాలను బోధిస్తున్నారు. వర్షం వస్తే తడిసి ముద్దావాల్సిన పరిస్థితి. గాలి వీస్తే ఏరేకు ఎక్కడ పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కనీసం ఒక్క మరుగు దొడ్డి కూడా లేదు. ఆటస్థలం ఊసేలేదు. బోధన సిబ్బంది, విద్యార్థులు మరుగు కోసం ఆరుబయటకు పరుగులు తీస్తున్నారు. కూటమి ప్రభుత్వ పాలన వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం ఈ పాఠశాలను స్వాధీనం చేసుకుంది. అయినా విద్యార్థుల భవితవ్యాన్ని కనీసం పట్టించుకోలేదు. ఈ విషయమై ఎంఈఓ -2 శ్రీనివాసరావును వివరణ కోరగా పాఠశాల పరిస్థితిపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. స్థలం కోసం అన్వేషణ చేస్తున్నామన్నారు.



ఒకే ఇరుకు గదిలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

గురుకులంలో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ లక్ష్మి

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట గ్రామ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ వీఎస్.లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో 42 సీట్లు, 7వ తరగతిలో 14, 8వ తరగతిలో 17, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను సమర్పించేందుకు ఈ నెల 23వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. దరఖాస్తులను జిల్లాలో గల ఏ గురుకుల పాఠశాలలోనైనా సమర్పించవచ్చన్నారు. పరీక్ష 25వ తేదీన నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని వారు మరోమారు ఈ నెల 26వ తేదీన నెల్లిమర్లలో నిర్వహించ నున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9704550020 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రిక్షాకాలనీకు రైల్వే ట్రాకు కష్టాలు



రిక్షాకాలనీ, జి.అగ్రహారం నివాసాలకు మధ్య నుంచి రైళ్ల రాకపోకలు

చీపురుపల్లి: పట్టణ పరిధిలోని రిక్షా కాలనీకు రైల్వే ట్రాకు కష్టాలు వెంటాడుతున్నాయి. మేజర్ పంచాయతీ పరిధిలోని 20 వార్డులు ఉండగా అందులో రిక్షాకాలనీ ఒకటి. ఈ కాలనీలో దాదాపు 300 నివాసాలు వరకు ఉంటాయి. కాలనీకి ఆనుకుని రైల్వే ట్రాకు ఉంది. అది కూడా సాధారణ రైల్వే ట్రాకు కాదు సాక్షాత్తూ హౌరా- చెన్నై ప్రధాన రైల్వే ట్రాకు కావడం గమనార్హం. అయితే ఇటు రిక్షాకాలనీ అటు జి.అగ్రహారంకు మధ్యలో జనావాసాలకు అత్యంత సమీపంలో హౌరా- చెన్నై ప్రధాన రైల్వే ట్రాకు ఉంది. దీంతో నిరంతరం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు సాధారణ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్లు ప్రయాణిస్తుంటాయి. నివాసాలకు అతి సమీపంలో రైల్వే ట్రాకు ఉండడంతో నిరంతరం రైళ్ల రాకపోకలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పొరపాటున ఆదమరిచి చిన్నపిల్లలు రైల్వే ట్రాకువైపు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ట్రాక్‌వైపు వెళ్లే అవకాశం లేకుండా రిటర్నింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థి చదువుకు వితరణగా రూ.50 వేల అందజేత



గ్రీష్మకు వితరణగా రూ.50వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం గ్రామ మాజీసర్పంచ్ దాకారపు దేమున్నాయుడు కొద్ది నెలల క్రితం ఆనారోగ్యంతో మృతి చెందగా ఆయన పిల్లల చదువు మధ్యలో ఆగిపోయింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చొరవ తీసుకుని తన సొంత నిధులు ఇంజినీరింగ్ చదువుతున్న గ్రీష్మకు రూ.50వేలు గురువారం అందజేశారు. గ్రీష్మ చదువు పూర్తయ్యేంతవరకు ఎంత ఖర్చు అవుతుందో అంతా తానే భరాయిస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. దీంతో గ్రీష్మ తల్లి, తాత, నాయనమ్మలు ఎమ్మెల్యే లలితకుమారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోళ్ల రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూరీసర్వే రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ

దత్తిరాజేరు: మండలంలో సమగ్ర భూరీసర్వే జరిగిన గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే జరిగిన గ్రామాల్లో భూసమస్యలపై రైతుల నుంచి అందే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. సర్వే సమయంలో భూముల వద్ద లేని రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు స్వీకరించి ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. భూమి ఎక్కువ ఉండి రికార్డుల్లో తక్కువ చూపిస్తున్నా, రికార్డుల్లో భూములు కనిపించకపోయినా, తదితర సమస్యలున్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని చెప్పారు.

కార్మికుల బైక్ ర్యాలీ



మున్సిపల్ ఇంజినీరింగ్ వాటర్ వర్క్స్, పర్యావరణ, ఎలక్ట్రికల్, నాన్ పీహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21000, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని కోరుతూ.. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం విజయనగరంలోని బాలాజీ నగర్ వాటర్ ట్యాంక్ నుంచి కొత్తపేట వాటర్ ట్యాంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ నాన్ సీహెచ్ కార్మికులకు ప్రభుత్వం జీతాలు పెంచుతూ తక్షణమే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్, 62 సంవత్సరాల వరకు కొనసాగించాలని నినదించారు. సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్‌రావు ఎస్.రాముునాయుడు, భాస్కరరావు, వెంకటేష్, ధనుంజయ, సత్యనారాయణ, రాజు, ఉమామహేశ్వరరావు, తిరు తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం గంటస్తంభం

21న యోగా శిక్షణ

చీపురుపల్లి: అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని కొత్త అగ్రహారంలోని ఆర్య సమాజంలో ఈ నెల 21న ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని భారత్ స్వాభిమాన్ జిల్లా అధ్యక్షుడు ఇజ్జరోతు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

చీపురుపల్లి: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం నేతృత్వంలో ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకునే వారి కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకోసం జూన్ 27లోగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

గజపతినగరం ఏపీఎంగా నారాయణరావు



గజపతినగరం: మండల వెలుగు ఏపీఎంగా పి.నారాయణరావు స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గరివిడి మండలం నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఎల్.సత్యనారాయణ కాకినాడకు బదిలీ అయ్యారు.

సీసీ రోడ్డు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న పొట్నూరు సన్యాసినాయుడు

గుర్ల: మండలంలోని పాలవలస చందక వీధిలో రూ.3లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువలను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు గురువారం ప్రారంభించారు. పాలవలస ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నామన్నారు. ఎంపీపీ నిధులతో పాలవలసను పూర్తిస్థాయి అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరి రాము, గ్రామ పెద్దలు రౌతు రామునాయుడు, పెనుమజ్జి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



దుమ్మెద గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సేవాసమితి, జ్ఞానవేదిక కమిటీ సభ్యులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని దుమ్మెద, దేవాడ, నడిపేనపేట గ్రామాల్లో గురువారం త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాలపై ప్రచారం చేశారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం సాగింది. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామినాయుడు, సూరపనాయుడు, అప్పలరాజు, మద్దిరాజు, పూర్ణ, ఈశ్వరమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సూర్య ప్రభు



చీపురుపల్లి: పట్టణంలోని జీవీ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డి.సూర్యప్రభు నియమితులయ్యారు. ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన మద్దలి వినోద్‌బాబుకు విశాఖపట్టణం జిల్లా పరవాడ కళాశాలకు బదిలీ అయింది.

భూసమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ జ్ఞానదీపిక,జెడ్పీటీసీ తవుడు



మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక

గజపతినగరం: మండల రైతులను పీడిస్తు్న భూసమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జ్ఞానదీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. వ్యవ సాయ, వైద్య, రెవెన్యూ, ఐసీడీఎస్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పశు సంవర్ధక, ఇరిగేషన్,వెలుగు తదితర శాఖల అధికారు లు తమ శాఖల ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించారు.ఈసందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ఎక్కువగా భూసమస్యల తో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాయింట్ ఎల్‌పీఎంల పేరిట అధికంగా భూములు నమోదై ఉన్నా యని, వీఆర్‌ఓలు, సర్వేయర్‌లు సమస్య ఉన్న భూమి మీదకు వెళ్లి సబ్ డివిజ న్(విడదీయడం)చేయాలని సూచించారు. పలు గ్రామాల్లో భూములు ఇనాం పేరుతో ఉన్నాయని వాటికి మ్యుటేషన్ అవ్వడం లేదని, వన్‌బీలు రావడం లేదని రైతులు చెబుతున్నా రని ఈసమస్యలను పరిష్కరించాలని ఆదే శించారు. రేషన్ కార్డులకు సంబంధించి యాడింగ్ ప్రక్రియ (సభ్యుల నమోదు)అవు తోంది కానీ విడదీయడం అవ్వడం లేదని, ఇది పెద్ద సమస్య గా తయారైందని, దీనిపై అధికారులు శ్రద్ధ పెట్టాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వ యంతో పని చేయాలని ఆదేశించా రు. ఎంపీడీఓ బి.కల్యాణి, వైస్ ఎంపీపీ జి.దమయంతి, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి



వెలుగు సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న సెర్ప్ అడిషనల్ సీఈఓ శ్రీరాములునాయుడు

గజపతినగరం: డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సెర్ప్ అడిషనల్ సీఈఓ శ్రీరాములునాయుడు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు సిబ్బంది, వీఓఏలతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ డ్వాక్రా సంఘాల సభ్యులకు సంబంధించిన పొదుపులు, రుణాల వివరాలను ఆన్‌లైన్‌లో సెర్ప్ ఎస్‌హెచ్‌జీ ఈచ్ 2.0లో నమోదు చేయా లని సూచించారు. వివరాల నమోదు చేసేటప్పుడు ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని వీఓఏలు, సీసీఎస్‌లను అడిగి తెలుసు కున్నారు. అన్నిసంఘాలు ప్రగతిపదంలో నడిచేలా చూడాలని సూచించారు. వెలుగు ఏపీడీ సావిత్రి, స్త్రీనిధి డీజీఎం కృష్ణంనాయుడు, ఏజీఎం చిట్టిబాబు, డీపీఎం లక్ష్మునాయుడు, ఏపీఎం పి.నారాయణరావు,తదితరులు పాల్గొన్నారు.

అమృతాహారంతో యోగా.. ఆరోగ్యం



ఉచిత శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు యోగా ఆసనాలు నేర్పుతున్న శిక్షకుడు కొరుపోలు

- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ఓ టీచర్ ప్రచార బాట

విజయనగరం అర్బన్: శారీరక దారుఢ్యం, మానసిక పురోగతి సమతుల్యంగా అందించే ప్రక్రియలో యోగాకు ప్రత్యేక స్థానం ఉంది. యోగాసనాలు చేస్తూ, ప్రకృతిలో అభించే కంద మూలాలను తింటే నిత్యం ఉల్లాసంగా ఉత్తేజంగా ఉంటారు. 'ఆరోగ్య భోగ' భాగ్యాలతో తులతూగినట్లే అంటున్నారు పట్టణానికి చెందిన యోగా ప్రావీణ్యుడు, రిటైర్డ్ అవార్డు ఉపాధ్యాయుడు కొరుపోలు సత్యారావు. ఆయన వృత్తి విద్యాబోధన.. ప్రవృత్తి యోగా ప్రచారం. యోగా ప్రాచుర్యం వల్ల ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చనే నిజాన్ని తెలియజేయాలనే లక్ష్యంగా తీసుకొని కృషి చేస్తున్నారు. ఆయన నివాస ప్రాంగణంలోనే ఉచితంగా యోగా నేర్పుతున్నారు. బాల్యం నుంచి అన్ని వయసుల వారికీ యోగా దిన చర్యలుగా ఉంటూ సమీకృత ఆహారం అలవాటుగా సాగాలని అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని ఆయన నమ్మకం.

యోగాతో ఆరోగ్యం

శీర్షాసనం: రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం కాంతివంతంగా మారుతుంది. గుండె, మెదడుకు రక్తప్రసరణ చక్కడా అందుతుంది.

ఉగ్రాసనం: నడుం వద్ద కొవ్వు తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. బీపీ, షుగర్ కంట్రోల్ అవుతుంది.

ప్రాణాయామం: శ్వాస సంబంధమైన వ్యాధులు పటాపంచలవుతాయి. ప్రాణాయామంతో శరీరం ఆధీనంలోనే ఉండటంతో పాటు మానసిక ధైర్యం వృద్ధి చెందుతుంది.

మత్స్యాసనం: అన్ని అవయవాలకు మేలు కలుగుతుంది.

శవాసనం: స్వరపేటికకు మంచి వ్యాయామం. గొంతు కండరాలకు మేలు కలుగుతుంది. వెన్ను గట్టి పడుతుంది.

హలాసనం: శరీరం గట్టి పడటంతో పాటు యవ్వనంగా మారుతారు. వర్తులాసనంలో కూడా ఇవే లక్షణాలుంటాయి.

సర్వాంగాసనం: జుట్టు నెరపకుండా ఉంటుంది. శరీరానికి రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. చర్మ వ్యాధులు విచారించబడతాయి. కళ్లు కాంతివంతంగా మారుతాయి.

ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్:

ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని ఒక్క తల్లిని తప్ప ఎవరిని నమ్మలేని పరిస్థితులు ఉన్నాయని, తల్లిదండ్రుల చెప్పిన మాటలు తప్పక వినాలని జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. బాబామెట్టలో ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను వారు ఖండించారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ప్రతి రోజు పేపర్ చదివే అలవాటు చేసుకోవాలని అందువలన సమాజంలో జరిగే పరిస్థితులు అర్థం అవుతాయని హితువు పలికారు. విద్యా హక్కు చట్టం గురించి, బాల కార్మిక వ్యతిరేక చట్టం గురించి, యాచక బాలల నిరోధం గురించి విద్యార్థులకు తెలిపారు. 14 ఏళ్లలోపు బాలబాలికలు స్కూల్‌లోనే ఉండాలని వారిని పనికి పంపరాదని హితవు పలికారు. ఎవరైనా బాలలను పనిలోగాని దుకాణాలలోగాని పనిచేయించినట్లయితే అట్టివారు శిక్షార్హులని తెలిపారు. బాలికలతో ముఖాముఖిగా చర్చించి వారి యొక్క సందేహాలు, సమస్యలు ఏవైనా ఉన్నట్లయితే తమకు తెలియజేయాలని సూచించారు. ఎవరైనా బాలికలకు ఇబ్బందులకు గురి చేస్తే వాటిని తమ దృష్టికి తీసుకువస్తే వారిపై న్యాయపరమైన చర్యలు ఉంటాయని తెలియజేశారు. బాల బాలికలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఎప్పుడు అండగా ఉంటుందని వారు ఏ సమయంలోనైనా జాతీయ న్యాయ సేవ అధికారి సంస్థ టోల్ ఫ్రీ నంబరు 15100 ఫోన్ చేసి వారి సమస్యలను తెలియజేయాలని సూచించారు. అవగాహన సదస్సులో స్కూల్ హెచ్‌ఎం పి.రమణమ్మ, న్యాయవాది పి.వి.వరలక్ష్మి, బెజ్జిపురం ఎన్జీవో కో-ఆర్డినేటర్ జి.ఝాన్సీ, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మండల సర్వ సభ్యసమావేశం

వేపాడ: వేపాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయిలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు శాఖాపరమైన నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

సోంపురంలో సీసీరోడ్డుకు భూమిపూజ



భూమిపూజ చేసిన ఎంపీపీతో పాటు సర్పంచ్ తదితరులు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు గురువారం భూమి పూజ నిర్వహించారు. మండల పరిషత్ నిధులు రూ.రెండులక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఎంపీపీ తెలిపారు. గ్రామసర్పంచ్, నియోజకవర్గ బీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ ఆకుల సత్యనారాయణ సమక్షంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పెద్దలు తొండవరపు మల్లేశ్వరరావు, పత్రికాళీ, గణపతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు,పెన్నుల వితరణ



పిల్లలకు పుస్తకాలు.పెన్నులు అందచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు శంకర్రావు మాస్టారుతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన రెడ్డి శంకర్రావుకు పిల్లలపై ఉన్న మమకారం అభినందనీయమంటూ పలువురు ప్రశంసించారు. ఈ మేరకు గురువారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శంకర్రావు రూ.పదివేల విలువ చేసే నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, రబ్బర్లు, తదితర వస్తువులను 60 మందికి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తేవాలని శంకర్రావు మాస్టారు ఆకాంక్షించారు. రామసత్యం, పి.వరప్రసాద్, నర్సింహమూర్తి తదితర ఉపాధ్యాయ బృందం, కమిటీ సభ్యులు విశ్రాంత ఉపాధ్యాయుడు శంకర్రావు మాస్టారుకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్దతు కోరిన జిందాల్ నిర్వాసితులు



టీడీపీ కన్వీనర్ రాంప్రసాద్‌ను కలిసిన జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ కోసం భూములు ఇచ్చి నష్టపోయిన తమకు న్యాయం చేయాలని, భూములు కోల్పోయి నిర్వాసితులమైన తమకు మద్దతు పలకాలని జిందాల్ రైతులు గురువారం పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల పెద్దల ఇళ్లకు వెళ్లి మద్దతు కోరారు. మూడు రోజుల క్రితం కలెక్టర్‌ను గ్రీవెన్స్‌సెల్‌లో కలిసిన నిర్వాసితులు గురువారం ఎమ్మెల్యే లలితకుమారి, టీడీపీ కన్వీనర్ రాంప్రసాద్ ఇంటికి వెళ్లి కలిసి తమ సమస్య వివరించారు. అక్కడి నుంచి డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ ఒబ్బిన సత్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, సీపీఎం కార్యదర్శి మద్దిల రమణలను కలిసి వినతి పత్రాలు అందచేశారు.

దళిత సర్పంచ్‌కు అవమానం తగదు

శృంగవరపుకోట: దళిత సర్పంచ్‌ను అవమానించడం అన్యాయం. కూటమి నేతల దాష్టీకానికి దానాపూర్ ఘటన మరో ఉదాహరణ అని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి జయశంకర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో దానాపూర్ ఘటనను ఖండించారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం దానాపూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకులు గ్రామసర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించడం అన్యాయమన్నారు. బహిరంగ సమావేశంలో గ్రామసర్పంచ్‌ను వేదిక మీదికి పిలిచిన ఎమ్మెల్యే పార్థసారథి పక్కన ఉన్న తెలుగుదేశం నాయకురాలు గుడిసె కృష్ణమ్మ అతను ఎస్సీ కులస్తుడు అని చెప్పడంతో వేదికపైకి రానీయకుండా కిందనే నిలబెట్టడం అన్యాయమన్నారు. ప్రజల్ని, చట్టాలను గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులు ఎస్సీ, ఎస్టీ చట్టాలను అపహాస్యం చేస్తూ దళితులను వేరుగా చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని మండిపడ్డారు. బహిరంగంగా సర్పంచ్ దళితుడు అని చెప్పిన తెలుగుదేశం నాయకురాలు కృష్ణమ్మ, ఆమెను సమర్థిస్తూ గ్రామసర్పంచ్‌ను గౌరవించకుండా తన కాళ్ల వద్ద నిలబెట్టిన ఎమ్మెల్యే పార్థసారథిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.